సాక్షి
అనంతపురం
బుధవారం । 31 । మే । 2023



చీనీ టన్ను రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి.



ఆల్ ఫ్రీ బాబుతో జాగ్రత్త!

ఓట్ల కోసం ఉత్తుత్తి హామీలిచ్చే ఆల్ ఫ్రీ బాబు పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మంత్రి ఉషశ్రీచరణ్ హెచ్చరించారు.

10లో

గరిష్టం/కనిష్టం
40.4°/23.8°

జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం, ఉక్కపోత అధికంగా ఉంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలిక పాటి వర్షం కురిసింది.

కంప్యూటర్ కోర్సులకే మొగ్గు

- సంప్రదాయ కోర్సుల బోధనకు విముఖత
- డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు కాలేజీ యాజమాన్యాల యత్నం
- దరఖాస్తు చేసిన జేఎన్‌టీయూ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలు
- మరో 3వేల కంప్యూటర్ సైన్సెస్ కోర్సుల సీట్ల పెంపుదలకు అనుమతి



అనంతపురం: ఇంజినీరింగ్ విద్య అనగానే వెంటనే గుర్తొచ్చేది సివిల్, మెకానికల్ కోర్సులే. కోర్ బ్రాంచుల్లో అత్యంత కీలకమైన ఈ రెండు కోర్సుల మనుగడ ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారుతోంది. కంప్యూటర్ సైన్సెస్ కోర్సులకు ఉన్న డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు కొన్ని ప్రైవేట్ కళాశాలలు తెలివిగా పావులు కదిపాయి. మరో వైపు ఏఐసీటీఈ (ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) సీట్ల కేటాయింపుపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయడంతో అనుకున్నదే తడవుగా అనుమతి తెచ్చుకున్నాయి. సంప్రదాయ కోర్సులైన సివిల్, మెకానికల్ బ్రాంచులపై ఆసక్తి సన్నగిల్లేలా వ్యవహరిస్తూ... కంప్యూటర్ కోర్సులకు పెద్ద సంఖ్యలో సీట్లు మంజూరు చేయించుకున్నాయి. తద్వారా మేనేజ్‌మెంట్ కోటాలో ఫీజుల రూపంలో రూ.లక్షలు దండుకోవాలని చూస్తున్నాయి.

అదనపు సీట్ల మంజూరు

సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ సీట్లు రద్దు చేసి కంప్యూటర్ సైన్సెస్ కోర్సుల్లో అదనపు సీట్లు మంజూరు చేయాలని జేఎన్‌టీయూ అనుబంధ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యాలు దరఖాస్తు చేశాయి. జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో 100 ఇంజినీరింగ్ కళాశాలలు ఉండగా, సింహభాగం కళాశాలలు కంప్యూటర్ సైన్స్ బ్రాంచ్‌లకు దరఖాస్తు చేసి ఏఐసీటీఈ నుంచి అనుమతి తెచ్చుకున్నాయి. సివిల్, మెకానికల్ కోర్సుల్లో సీట్లు తగ్గించుకుని .. తగ్గించిన సీట్లను కంప్యూటర్ సైన్సెస్‌కు మార్పు చేసుకున్నాయి. ఈ తరహాలో ఇప్పటికే 3 వేల కంప్యూటర్ సైన్సెస్ సీట్లు అదనంగా పెరిగాయి. 2023–24 విద్యా సంవత్సరానికి ఇంజినీరింగ్ సీట్లకు ఏఐసీటీఈ నుంచి అనుమతి తెచ్చుకున్నాయి. జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో 39 వేల ఇంజినీరింగ్ సీట్లు అందుబాటులో ఉండగా, 60 నుంచి 65 శాతం సీట్లు కేవలం కంప్యూటర్ సైన్సెస్ వాటి అనుబంధ బ్రాంచ్‌లవి ఉన్నాయి. ఒక ఇంజినీరింగ్ కళాశాలకు మొత్తం 360 సీట్లు ఉంటే ఇందులో 300 సీట్లు కంప్యూటర్ సైన్సెస్‌కు భర్తీ చేసుకోవచ్చునని ఏఐసీటీఈ పచ్చజెండా ఊపడంతో అన్ని కళాశాలలు ఈ మేరకు ఆసక్తి చూపాయి. తక్కిన 60 సీట్లలో రెండు కోర్ బ్రాంచ్‌లు ఒక్కొక్కటి 30 చొప్పున సివిల్, మెకానికల్ వంటి కోర్సులకు కేటాయించారు. అంటే ఒక్కో ఇంజినీరింగ్ కళాశాలలో 83 శాతం సీట్లు కంప్యూటర్ సైన్సెస్ కింద భర్తీ చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో 2023–24 విద్యా సంవత్సరంలో జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో 60 నుంచి 65 శాతం సీట్లు కంప్యూటర్ సైన్సెస్ భర్తీకి సుముఖత చూపారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఏఐసీటీఈ నిర్దేశించిన 83 శాతం కంప్యూటర్ సైన్సెస్ సీట్లు భర్తీ చేసుకుని తీరతారు. ఈ క్రమంలో సంప్రదాయ కోర్సుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిపోయి... బీటెక్ అంటే కంప్యూటర్స్ అనే స్థాయికి చేరిపోయిందని విశ్లేషకులు ఆవేదన చెందుతున్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల భవిత ప్రశ్నార్థకం

సంప్రదాయ కోర్సుల కనుమరుగు దుష్పరిణామాలకు దారితీస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా పాలిటెక్నిక్ కోర్సులు చేసిన విద్యార్థులు ఇంజినీరింగ్ రెండో ఏడాదిలో నేరుగా ప్రవేశం పొందే వీలుంది. సంప్రదాయ కోర్సుల్లో సీట్లన్నీ ఎత్తేస్తే వాళ్ల పరిస్థితి ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. సివిల్, మెకానికల్ వంటి కోర్సులకు ప్రాధాన్యత అధికంగా ఉంటుంది. అలాగే ఆటోమొబైల్, రియల్ ఎస్టేట్ రంగాలు అభివృద్ధి చెందుతున్న సమయంలో సివిల్, మెకానికల్ కోర్సులు ఎత్తివేస్తే భవిష్యత్తులో సంబంధిత నిపుణుల కొరత ఏర్పడే ప్రమాదం ఉందని అంచనా వేస్తున్నారు.

సంప్రదాయ కోర్సులు తగ్గితే ప్రమాదకరం



సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సులు తగ్గిపోతే ప్రమాదకరం. ముఖ్యంగా పాలిటెక్నిక్ విద్యార్థులకు భవిష్యత్తు ఉండదు. ఈ నేపథ్యంలో ప్రతి కళాశాలలోనూ మెకానికల్, సివిల్ తప్పనిసరిగా 30 సీట్ల చొప్పున 60 సీట్లు ఉండాలని నిబంధన విధించాం. ఇలా ప్రతి బ్రాంచ్ తప్పనిసరే. విద్యార్థుల ఆసక్తి మేరకు బ్రాంచ్‌ను ఎంపిక చేసుకోవాలి.

– ప్రొఫెసర్ జింకా రంగజనార్థన, వీసీ, జేఎన్‌టీయూ అనంతపురం.

డ్రగ్స్ రహిత సమాజం కోసం సమష్టి కృషి



కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: డ్రగ్స్ రహిత సమాజం కోసం సమష్టిగా కృషి చేద్దామని ఎస్పీ కె.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గంజాయి తదితర మాదక ద్రవ్యాలు కళాశాలల దరిదాపుల్లోకి రాకుండా చూడాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. మంగళవారం పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. డ్రగ్స్ నియంత్రణ, అనర్థాలపై విద్యార్థుల్లో అవగాహన పెంచాలన్నారు. మత్తుకు అలవాటుపడితే ఆరోగ్యపరంగా ఎలాంటి నష్టాలుంటాయో వివరించాలన్నారు. కళాశాలల వద్ద డ్రగ్స్ అనర్థాలను సూచిస్తూ హోర్డింగులు ఏర్పాటు చేయాలన్నారు. డ్రగ్స్ అమ్మినా...తీసుకున్నా టోల్ ఫ్రీ నంబర్ 14500కు కాల్ చేస్తే వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కళాశాలలకు విద్యార్థులను తీసుకెళ్లే బస్సులు కండీషన్‌లో ఉంచాలన్నారు. బస్సు డ్రైవర్లకు కంటి చూపుతో పాటు ఇతర ఆరోగ్య పరీక్షలు, అలవాట్లపై ఆరా తీయాలన్నారు. విద్యార్థుల ప్రయాణానికి భద్రత కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. డ్రైవరు శారీరకంగా దృఢంగా ఉంటూ దురలవాట్లు లేని వారైతే ప్రమాదాలకు తావుండదన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్ విజయ భాస్కర్‌రెడ్డి, అనంతపురం డీఎస్పీ జి.ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పెన్నహోబిలం హుండీల ఆదాయం రూ. 20.21 లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న అధికారులు

ఉరవకొండ రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ఆరు శాశ్వత హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం దేవదాయ శాఖ ఉరవకొండ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రామతులసి, ఆలయ ప్రధాన కార్యనిర్వహణాధికారి కె.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో లెక్కించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా 31 రోజులకు సంబంధించి హుండీల ద్వారా రూ. 20,21,025 ఆదాయం వచ్చింది. ఈ మొత్తాన్ని ఆలయ ఖాతాకు జమచేస్తున్నట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో గుంతకల్లు హనుమాన్ సేవా సమితి సభ్యులు, ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మ్యానువల్ విధానంలో రిజిస్ట్రేషన్లు

అనంతపురం టౌన్: జూన్ ఒకటి నుంచి భూముల మార్కెట్ విలువ పెరగనున్న నేపథ్యంలో రిజిస్ట్రేషన్లు ఊపందుకున్నాయి. ఈ క్రమంలో రెండు రోజులుగా సర్వర్లలో సమస్య తలెత్తింది. దీంతో మ్యానువల్ విధానంలో రిజిస్ట్రేషన్ల చేసే విధంగా సబ్ రిజిస్ట్రార్లకు మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ అయ్యాయని జిల్లా రిజిస్ట్రార్ నాగభూషణం తెలిపారు. ఈ నెల 31లోపు రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ప్రభుత్వం నిర్దేశించిన రుసుమును ఆన్‌లైన్‌లో చెల్లించి రసీదులు పొందిన క్రయవిక్రయదారులకు సంబంధిత డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేసేందుకు వెసులుబాటు కల్పించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే రెండు రోజులుగా చలానాలు చెల్లించి రిజిస్ట్రేషన్‌లు కాని వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండానే రిజిస్ట్రేషన్లు అవుతాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మ్యానువల్ విధానంలోనే రిజిస్ట్రేషన్లు జరుగుతాయన్నారు. జూన్ 1 నుంచి ప్రభుత్వం సవరించిన మార్కెట్ విలువల మేరకు రుసుము చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

2న జిల్లా స్థాయి మెగా మేళా



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్

అనంతపురం అగ్రికల్చర్: నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జూన్ 2న రెండో విడత జిల్లా స్థాయి మెగా మేళా నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ తెలిపారు. కార్యక్రమ నిర్వహణపై మంగళవారం ఆయన తన చాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. ఒకటో తేదీలోగా 171 ట్రాక్టర్లు, మూడు కంబైన్డ్ హార్వెస్టర్లను బ్రాండింగ్ చేయించాలని ఆదేశించారు. మేళాకు పెద్ద సంఖ్యలో రైతులను ఆహ్వానించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏలు, టెక్నికల్ ఏఓలు పాల్గొన్నారు.

సమాచార వారధిగా కమిషన్



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్టీఐ కమిషనర్ హరిప్రసాద్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్, ఎస్పీ శ్రీనివాసరావు, డీఆర్వో గాయత్రీదేవి

- ఏపీ ఆర్టీఐ కమిషన్ దేశంలోనే క్రియాశీలకంగా పనిచేస్తోంది
- 19(1), 19(3) దరఖాస్తుల పరిష్కారంలో ప్రథమస్థానం
- ఆర్టీఐ కమిషనర్ యు.హరిప్రసాద్‌రెడ్డి

అనంతపురం అర్బన్: దరఖాస్తుదారులకు, అధికారులకు ఆర్టీఐ కమిషన్ సమాచార వారధిగా పనిచేస్తుందని సమాచార హక్కు చట్టం కమిషనర్ యు.హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. దేశంలోనే ఏపీ ఆర్టీఐ కమిషన్ క్రియాశీలకంగా పనిచేస్తోందన్నారు. 19(1), 19(3) దరఖాస్తుల పరిష్కారంలో దేశంలోనే రాష్ట్రం ప్రథమస్థానంలో ఉందని, ఇక దరఖాస్తులు వేగవంతంగా పరిష్కరించడంలో మూడో స్థానంలో ఉందని వివరించారు. అనంతపురం కేంద్రంగా మంగళ, బుధవారాల్లో ఆర్టీఐ క్యాంపు కోర్టు నిర్వహించే నిమిత్తం కమిషనర్ విచ్చేశారు. జిల్లాలో ఆర్టీఐ చట్టం అమలు తీరుపై ముందుగా ఆయన కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఎస్పీ కె.శ్రీనివాసరావు, డీఆర్వో గాయత్రీదేవితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు దిశనిర్దేశం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీఐ చట్టం సెక్షన్ 6(1) కింద సకాలంలో సమాచారాన్ని అందించాల్సి ఉంటుందన్నారు. అయితే ఆర్టీఐ కింద ఎలాంటి సమాచారం ఇవ్వాలి... ఏది ఇవ్వకూడదనే విషయంలో సన్నటి విభజన రేఖ ఉంటుందన్నారు. అధికారులు దీన్ని గమనిస్తే చాలన్నారు. దరఖాస్తుదారు కోరుతున్న సమాచారం విస్తృత ప్రయోజనాల దృష్ట్యా ఎక్కువ మంది ప్రజలకు ఉపయోగపడేదైతే అందించవచ్చన్నారు. న్యాయ వ్యవస్థకు సంబంధించిన సమాచారాన్ని ఆర్టీఐ వేదిక ద్వారా పొందేందుకు వీలులేదన్నారు. ఉద్యోగుల వ్యక్తిగత అంశాలకు సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు వీలులేదన్నారు. దరఖాస్తుదారు తరఫున న్యాయవాదులు సెక్షన్ 6(1) కింద సమాచారాన్ని ఇవ్వకూడదన్నారు. అది న్యాయవాదికి తన కక్షిదారునికి సంబంధించి వాణిజ్య అంశంగా పరిగణించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తుదారు కోరుతున్న సమాచారాన్ని అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంచితే సమాచారం కోరే దరఖాస్తుల సంఖ్య తగ్గుతుందన్నారు. ఇదే విషయాన్ని అధికారులకు చెప్పామన్నారు.

12 కేసుల విచారణ

రెవెన్యూభవన్‌లో నిర్వహించిన క్యాంపు కోర్టులో తొలి రోజు మంగళవారం 12 కేసులను ఆర్టీఐ కమిషనర్ విచారణ చేశారు. బుధవారం 16 కేసులు విచారణ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

సీనియారిటీ జాబితాపై 633 అభ్యంతరాలు

- నేడు, రేపు ప్రత్యేక కమిటీలతో టీచర్ల బదిలీల అభ్యంతరాల పరిశీలన



అభ్యంతరాలపై చర్చిస్తున్న డీఈఓ సాయిరామ్

రాప్తాడురూరల్: టీచర్ల బదిలీల్లో భాగంగా ప్రొవిజినల్ సీనియార్టీ జాబితాపై 633 అభ్యంతరాలు వచ్చాయి. మంగళవారం రాత్రిదాకా ఆన్‌లైన్‌లో అభ్యంతరాలకు అవకాశం ఇచ్చారు. వచ్చిన అభ్యంతరాల్లో 261 స్టేషన్ సీనియార్టీ పాయింట్లు తక్కువగా వచ్చాయనే వాటిపైనే ఉన్నాయి. రేషనలైజేషన్‌కు సంబంధించి 73, స్పౌజ్ కేటగిరీపై 46, సర్వీస్ పాయింట్లపై 29, ప్రిఫరెన్షియల్ కేటగిరీకి సంబంధించి 33, పీహెచ్ కేటగిరీపై 7, ఇతర అంశాలపై 184 అభ్యంతరాలు వచ్చాయి. మెడికల్ సర్టిఫికెట్లకు సంబంధించి కొందరు నకిలీవి పెట్టారంటూ ఫిర్యాదులు వచ్చాయి. వచ్చిన అభ్యంతరాలపై బుధ, గురువారం రెండురోజులు ప్రత్యేక కమిటీల ద్వారా పరిశీలన చేయిస్తారు. మెడికల్ సర్టిఫికెట్లకు సంబంధించి నిర్ధారణ కోసం మెడికల్ సూపరింటెండెంట్‌కు పంపనున్నారు. ఈ విషయమై డీఈఓ సాయిరామ్ స్వయంగా మెడికల్ సూపరింటెండెంట్‌తో మాట్లాడారు. అభ్యంతరాల పరిశీలన సమయంలో వివరాలు తెలిపేందుకు ఎంఈఓలు అందుబాటులో ఉండాలని డీఈఓ తెలిపారు.

తప్పుడు ధ్రువపత్రాలు పెడితే క్రిమినల్ కేసులు

వచ్చిన అభ్యంతరాలను పరిశీలించే విషయమై డీఈఓ సాయిరామ్ మంగళవారం రాత్రి డిప్యూటీ డీఈఓలు, డీఈఓ కార్యాలయ సిబ్బందితో సమావేశమై చర్చించారు. ప్రతి దరఖాస్తు క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ప్రిఫరెన్షియల్ కేటగిరీకి సంబంధించి ఎవరైనా తప్పుడు ధ్రువపత్రాలు పెట్టినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ డీఈఓలు పద్మప్రియ, శంకర్‌ప్రసాద్, సూపరింటెండెంట్ శ్రీనాథ్ పాల్గొన్నారు.

సాక్షి మీడియా గ్రూప్, ఆర్.సి ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో

గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

- జూన్ 4వ తేదీ ఉదయం 09:30 నుంచి 12:30 వరకు
- టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్

సాక్షి ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దాదాపు 1,000 వరకు గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో సాక్షి ఎడ్యుకేషన్.కామ్ (www.sakshieducation. com) రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్.సి ఎగ్జామ్స్‌తో కలిసి జూన్ 4వ తేదీ ఉదయం 09:30 నుంచి 12:30 వరకు అనంతపురంలోని Ambedkar Convention Centre, Sai Nagar నందు ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షి ఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికీ తెలిసిందే.

లెజండరీ ఫ్యాకల్టీతో.. : ఈ అవగాహన సదస్సుకు రాష్ట్రంలోనే లెజండరీ ఫ్యాకల్టీలైన బి.కృష్ణారెడ్డి (పాలిటీ), అబ్దుల్ కరీం(హిస్టరీ), సి.హరికృష్ణ (సైన్స్ అండ్ టెక్నాలజీ), ఎండీ పాషా (ఎకానమీ), ప్రొ. చింతా గణేష్ (సోషియాలజీ), మట్టపల్లి రాఘవేంద్ర(కరెంట్‌అఫైర్స్), శంకర్ రెడ్డి(మెంటల్ ఎబిలిటీ), జల్లు సద్గుణరావు (జాగ్రఫీ) లాంటి వారు హాజరుకానున్నారు. అవగాహన సదస్సుతో పాటు అదే రోజు టాలెంట్ టెస్ట్ నిర్వహించి జిల్లాలో మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నారు. త్వరలోనే వెయ్యికి పైగా గ్రూప్–2 ఉద్యోగాలకు నోటిఫికేషన్ రానుండటం.. దీనికి తోడు గ్రూప్–2కు కొత్త సిలబస్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఈ అవగాహన సదస్సులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. అవగాహన సదస్సు, టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా 8985094499 ఫోన్ నెంబరుకు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

అవగాహన సదస్సు తేదీ : జూన్ 4, 2023
వేదిక : అంబేడ్కర్ కన్వెన్షన్ సెంటర్, సాయినగర్, అనంతపురం
సమయం : ఉదయం 09:30 నుంచి 12:30 వరకు

రెవెన్యూలో బదిలీలకు 172 మంది దరఖాస్తు

- నేటితో ముగియనున్న బదిలీల ప్రక్రియ

అనంతపురం అర్బన్: జిల్లా వ్యాప్తంగా 172 మంది రెవెన్యూ ఉద్యోగులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో తహసీల్దార్లు 9 మంది, డిప్యూటీ తహసీల్దార్లు 42 మంది, సీనియర్ అసిస్టెంట్లు 33 మంది, జూనియర్ అసిస్టెంట్లు 15 మంది, టైపిస్టులు ముగ్గురు ఉన్నారు. బదిలీల ప్రక్రియ బుధవారంతో ముగియనుంది. ఉద్యోగులు బదిలీ దరఖాస్తుతో పాటు స్థానాలకు ఆప్షన్లు ఇచ్చారు. సీనియార్టీని అనుసరించి స్థానాలను కేటాయిస్తారు.

పశుశాఖలో ఆఫీస్ సబార్డినేటర్ల బదిలీ

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి అనంతపురం జిల్లా పశు సంవర్ధకశాఖలో పని చేస్తున్న 16 మంది ఆఫీసు సబార్డినేటర్లకు మంగళవారం బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల కౌన్సిలింగ్ నిర్వహించిన వారందరికీ తాజాగా పోస్టింగ్‌లు ఇచ్చారు. బదిలీ ఉత్తర్వులు అందుకున్న వారిలో కె.మహేష్, సి.కొండన్న, బి.రామకృష్ణ, కె.శ్రీనివాసులు, డి.అనిల్‌కుమార్, జి.రామాంజినమ్మ, టి.లక్ష్మీదేవి, ఎం.సరోజ, కె.నారాయణస్వామి, పి.ఓబిరెడ్డి, జి.దేవరాజు, బి.శ్యామల, బి.చక్కిరప్ప, సి.ప్రమీలమ్మ, ఎస్.ప్రతాప్‌నాయుడు, కె.మల్లికార్జున ఉన్నారు. చియ్యేడు వెటర్నరీ అసిస్టెంట్ కె.నారాయణస్వామిని చోళసముద్రంలోని వెటర్నరీ డిస్పెన్సరీ (వీడీ హాస్పిటల్)కి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్రంలో సంక్షేమ విప్లవం

- 98 శాతానికి పైగా హామీలు నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్
- 2014 ఎన్నికల మేనిఫెస్టో, విభజన హామీలేమయ్యాయి బాబూ?
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు

అనంతపురం క్రైం: నాలుగేళ్ల తన పాలనలో ఎన్నో సంస్కరణలు అమలు చేస్తూ రాష్ట్రంలో సంక్షేమ విప్లవాన్ని సీఎం వైఎస్ జగన్ తీసుకువచ్చారని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి కొనియాడారు. జగన్ సర్కార్ ఏర్పాటై నాలుగేళ్లు విజయవంతంగా పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం సంబరాలు నిర్వహించారు. దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2019 ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 98.5 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. అవినీతికి తావులేకుండా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందజేస్తున్నారన్నారు. అమ్మఒడి, విద్యా/వసతి దీవెన, ఇంగ్లిష్ మీడియం చదువులతో నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను చేరువ చేశారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పన, వైద్య రంగంలో ఖాళీగా ఉన్న 48వేల పోస్టుల భర్తీతో పేదలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు.

2014 ఎన్నికలకు ముందు టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టో, విభజన హామీలను అధికారం చేపట్టిన తర్వాత చంద్రబాబు పక్కన పెట్టేశారన్నారు. చివరకు తాను ప్రకటించిన మేనిఫెస్టోను సైతం మాయం చేసి ప్రజల కళ్లుగప్పారని గుర్తు చేశారు. ప్రస్తుతం జగన్ సర్కార్ అందిస్తున్న సంక్షేమ పథకాలకే పేరు మార్పు చేసి మహానాడు వేదికగా చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో మోసపూరితమేనన్నారు. 2024 ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. సీఎం వైఎస్ జగన్ చొరవతోనే అనంతపురం నియోజకవర్గ అభివృద్ధికి బాటలు పడ్డాయన్నారు. రూ.2,069 కోట్ల విలువైన సంక్షేమ ఫలాలు అందాయన్నారు. 23 వేల మందికి సొంతింటి కల సాకారమైందన్నారు. రూ.650 కోట్లతో రోడ్లు, కాలువల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా నాణ్యమైన వైద్య సేవలు చేరువయ్యాయన్నారు. రూ.300 కోట్లతో ఎంసీహెచ్ బ్లాక్‌ను ఏర్పాటు చేశామన్నారు. టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్ల పేరుతో 8 వేల మందికి పైగా లబ్ధిదారులతో డిపాజిట్లు సేకరించి, కేవలం 5వేల మందికి మాత్రమే స్థలం చూపించారని, ఇందులోనూ 2,300 మందికి మాత్రమే పాక్షిక పునాదులు వేసి మోసం చేశారన్నారు. ఆ టిడ్కో ఇళ్లలో 80 శాతం జగన్ సర్కార్ పూర్తి చేసి మరో రెండు నెలల్లో లబ్ధిదారులకు అందజేస్తున్న తరుణంలో సెల్ఫీల పేరుతో టీడీపీ నాయకులు నాటకాలకు తెరలేపడం సిగ్గుచేటన్నారు.

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలభ్యున్నతికి సీఎం జగన్ చేసిన కృషిని కొనియాడారు. మహానాడు వేదికగా చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో టిష్యూ పేపర్‌తో సమానమని విమర్శించారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ.. మహిళలకు రాజకీయ ప్రాధాన్యత, వారికి రక్షణగా దిశ చట్టాన్ని ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్ చర్యలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఉర్దూ అకాడమీ రాష్ట్ర ఛైర్మన్ నదీం అహమ్మద్ మాట్లాడుతూ.. మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన ఘనత వైఎస్ కుటుంబానికే దక్కుతుందన్నారు.

కార్యక్రమంలో మేయర్ వసీం, అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర రెడ్డి, వాసంతి సాహిత్య, డీసీసీబీ ఛైర్‌పర్సన్ లిఖిత, రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ హరిత, వక్ఫ్‌బోర్డు జిల్లా ఛైర్మన్ రిజ్వాన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఎర్రిస్వామిరెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, కొర్రపాడు హుస్సేన్‌పీరా, శ్రీదేవి, సోమశేఖరరెడ్డి, కృష్ణవేణి, నాయకులు రిలాక్స్ నాగరాజు, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, గౌస్‌బేగ్, కార్పొరేటర్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

బ్లఫ్‌మాస్టర్ భరతం పట్టండి : ఎస్పీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: బ్లఫ్‌మాస్టర్ భరతం పట్టాలని అనంతపురం నాల్గో పట్టణ పోలీసులను ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశించారు. సామాన్యుడి అవసరాలను ఆసరాగా చేసుకుని మోసాలకు తెగబడుతున్న ఈ తరహా ముఠా సభ్యులపై దృష్టి పెట్టాలని సూచించారు. నగరంలోని ఓ ధాబా యజమానిని రాకెట్లకు చెందిన బోయ సురేష్, శ్రీనివాసయాదవ్‌తో పాటు వారి ముఖ్య అనుచరుడు రూ.కోటి దాకా మోసం చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. విషయాన్ని ఎస్పీ దృష్టికి బాధితుడు తీసుకెళ్లడంతో ఆయన తీవ్రంగా పరిగణిస్తూ కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలంటూ నాల్గో పట్టణ పోలీసులకు రెఫర్ చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆర్పీ పేరుతో 15 మంది నుంచి పలు దఫాలుగా డబ్బు తీసుకుని మోసగించిన బోయ సురేష్‌తో పాటు శ్రీనివాసయాదవ్ కోసం గాలిస్తున్నారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం


మృతుడు భాస్కరరెడ్డి

తాడిపత్రి: లారీ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. తాడిపత్రి మండలం కావేటి సముద్రం గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి, వరలక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు భాస్కరరెడ్డి (26) తాడిపత్రిలోని అపోలో ఫార్మసీలో పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం గ్రామం నుంచి తాడిపత్రికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా స్థానిక పెన్నానది నూతన వంతెనపై వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొంది. ఘటనలో భాస్కరరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న తాడిపత్రి రూరల్ ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

బాలుడి ఆత్మహత్య


ఖాసీం సా

తాడిపత్రి: కడుపునొప్పి తాళలేక ఓ బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన వన్నూరుబీ కుమారుడు ఖాసీంషా (15) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో నొప్పి భరించలేక మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు తల్లి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉపాధి పనులకు వెళ్లిన తల్లిదండ్రుల్లో తల్లి తొలుత ఇంటికి చేరుకుంది. తలుపు తట్టినా ఎంత సేపటికీ తెరవకపోవడంతో కిటికీ నుంచి తొంగి చూసింది. అప్పటికే ఫ్యాన్‌కు విగతజీవిగా వేలాడుతున్న కుమారుడిని చూసి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని తలుపులు బద్దలుగొట్టి ఖాసీంషాను కిందకు దించి, తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందాడని నిర్ధారించారు. ఘటనపై తాడిపత్రి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ముగిసిన రాయలసీమ విద్యా సదస్సు


మాట్లాడుతున్న రమేష్ పట్నాయక్

రాప్తాడు రూరల్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ అనంతపురం జిల్లా శాఖ సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ విద్య పరిరక్షణ కమిటీ భాగస్వామ్య సంఘాలైన ఏపీటీఎఫ్, డీటీఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్ సంయుక్తంగా స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించిన రాయలసీమ విద్యా సదస్సు మంగళవారం ముగిసింది. ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కె.కులశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సుకు ఆంధ్రప్రదేశ్ విద్య పరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేష్‌పట్నాయక్, డీటీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రత్న ఏసోపు పాల్గొన్నారు. సిలబస్ హేతుబద్ధీకరణ, శాస్త్రీయ, చారిత్రిక పార్టీ అంశాల తొలగింపుపై ప్రొఫెసర్ చంద్రశేఖర్, ప్రభుత్వ పాఠశాల స్థితిగతులు, నూతన జాతీయ విద్యా విధానంలోని లోపాలపై రమేష్ పట్నాయక్ మాట్లాడారు. ఐఫియా చీఫ్ ప్యాట్రన్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యారంగంలో ప్రస్తుతం నెలకొన్న సమస్యలను ఎలా అధిగమించాలో ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు మాట్లాడుతూ.. పాఠశాలల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం తెచ్చిన జీఓ వల్ల జరుగుతున్న నష్టం, శాస్త్రీయ విషయాలను సిలబస్‌లో తొలగించడంపై విద్యార్థులకు జరగబోయే నష్టాన్ని వివరించారు. సమావేశంలో ఏపీటీఎఫ్, డీటీఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆల్ ఫ్రీ బాబుతో జాగ్రత్త


సన్మానం అందుకున్న మంత్రి ఉషశ్రీచరణ్

- మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం : వచ్చే ఎన్నికల్లో అధికారం కోసం టీడీపీ అధినేత చంద్రబాబు మళ్లీ ఆల్ ఫ్రీ బాబుగా అవతారం ఎత్తి ప్రజల్లోకి వస్తున్నాడని... ప్రజలు జాగ్రత్త వహించకపోతే పెను ప్రమాదం చోటు చేసుకునే అవకాశముందని మంత్రి ఉషశ్రీచరణ్ సూచించారు. కళ్యాణదుర్గం మండలం శీబావి, మానిరేవు, కొండాపురం, తిమ్మసముద్రం, ముద్దినాయన పల్లి, కోడిపల్లి, బట్టువానిపల్లి, దురదకుంట గ్రామాల్లో మంగళవారం ఆమె సుడిగాలి పర్యటన చేశారు. స్థానిక నేతలతో కలసి ఆయా గ్రామ పంచాయతీల్లో చేపట్టిన సచివాలయ, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ల భవన నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. గ్రామాల అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమవుతుందన్నారు. సంక్షేమ పథకాలు ఉచితంగా ఇస్తే ఏపీ మరో శ్రీలంక అవుతుందని ఎద్దేవా చేసిన చంద్రబాబు మహానాడులో విడుదల చేసిన మేనిఫెస్టోలో ఉచిత పథకాలు ఎలా పొందుపరిచారంటూ ప్రశ్నించారు. ఆల్ ఫ్రీ బాబును ఎవరూ నమ్మడం లేదన్నారు. అనంతరం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రత్యేక నిధులతో నిర్మిస్తున్న వివిధ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వెంట జెడ్పీటీసీ బొమ్మన్న, సచివాలయల కన్వీనర్ ఆంజనేయులు, మార్కెట్ యార్డు డైరెక్టర్ బ్రహ్మయ్య, నాయకులు మోహన్‌రెడ్డి, సర్వోత్తమ, జోజిరెడ్డి, వన్నప్ప, తిప్పయ్య, రామకృష్ణ, రవి పాల్గొన్నారు.

శభాష్ కవిత!


పండంటి బిడ్డను చూపుతున్న సచివాలయ ఏఎన్‌ఎం కవిత

కళ్యాణదుర్గం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తోంది. దాదాపు 35 శాఖలకు సంబంధించి 500 సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. పింఛన్ కావాలన్నా..రేషన్ కార్డు కావాలన్నా.. ఇంటి పట్టాలు కావాలన్నా.. తాగునీటి సరఫరా సమస్య ఉన్నా.. సివిల్ పనులకు సంబంధించిన పనులు ఉన్నా.. వైద్యం కానీ.. ఆరోగ్యం కానీ.. రెవెన్యూ కానీ.. భూముల సర్వేకానీ.. శిశు సంక్షేమం కానీ.. డెయిరీ కానీ, పౌల్ట్రీ రంగాల సేవలు కానీ.. తదితర సేవలకు సంబంధించి సచివాలయాల్లో అర్జీ పెట్టుకున్న గంటల వ్యవధిలోనే ఉద్యోగులు పరిష్కరిస్తున్నారు. ఈ క్రమంలో పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణికి సకాలంలో సచివాలయ ఏఎన్ఎం కాన్పు చేసి తల్లీబిడ్డ ప్రాణాలు కాపాడారు.

ఆపదలో మేమున్నమంటూ.. : కళ్యాణదుర్గం మండలం తిమ్మసముద్రం గ్రామ సచివాలయంలో ఏఎన్ఎంగా పనిచేస్తున్న కవిత అందరి చేత శభాష్ అనిపించుకున్నారు. మంగళవారం ఉదయం కంబదూరు మండలం తిప్పేపల్లికి చెందిన గర్భిణి వినీతకు పురిటి నొప్పులు మొదలయ్యాయి. దీంతో కుటుంబసభ్యుల నుంచి సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని గర్భిణిని కళ్యాణదుర్గం సీహెచ్‌సీకి తరలించేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో నూతిమడుగు వద్దకు చేరుకోగానే గర్భిణికి నొప్పులు తీవ్రమయ్యాయి. దీంతో వాహనాన్ని పైలెట్ జనార్థన్ రోడ్డు పక్కన ఆపేశాడు. అదే సమయంలో తిమ్మసముద్రం సచివాలయానికి విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్న ఏఎన్ఎం కవిత అక్కడకు చేరుకున్నారు. ప్రసవ వేదనతో బాధపడుతున్న గర్భిణిని చూసి స్పందించిన ఆమె ఈఎంటీ బ్రహ్మయ్య సాయంతో వినీతకు ప్రసవం చేశారు. పండంటి ఆడబిడ్డకు వినీత జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను కళ్యాణదుర్గం సీహెచ్‌సీలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు సకాలంలో కాన్పు చేసి తల్లీబిడ్డ ప్రాణాలు కాపాడిన ఏఎన్ఎం కవితను అభినందించారు. ఏఎన్ఎం చూపిన చొరవపై కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి, సత్వర సేవలు అందించేలా చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

మృత్యువులోనూ వీడని స్నేహబంధం

- 30 నిమిషాల వ్యవధిలో తుదిశ్వాస విడిచిన స్నేహితులు


మృతులు వీరన్న, రవీంద్ర

గుంతకల్లు రూరల్: ఆ ఇద్దరూ ప్రాణస్నేహితులు.. ప్రతి పనినీ కలిసే చేసేవారు.. ఎక్కడికైనా కలిసే వెళ్లేవారు. చివరికి మృత్యువులోనూ వారు స్నేహం వీడలేదు. వివరాలు... గుంతకల్లు మండలం కసాపురం గ్రామానికి చెందిన ఉరుకుందప్ప, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు వీరన్న (26), అదే గ్రామానికి చెందిన రాము, మహాలక్ష్మి దంపతుల కుమారుడు రవీంద్ర (25) ఇటో డ్రైవర్లుగా జీవనం సాగిస్తున్నారు. తొమ్మిదేళ్ల క్రితం వీరన్నకు కృపాకుమారితో వివాహం కాగా, 6, 4 సంవత్సరాల వయసున్న ఇద్దరు బిడ్డలున్నారు. ఆరు నెలల క్రితం లక్ష్మి అనే యువతితో రవీంద్రకు వివాహమైంది. వీరన్న, రవీంద్ర ఒకే గ్రామానికి చెందిన వారే అయినా.. ఆటోడ్రైవింగ్ ద్వారానే ఇద్దరూ ప్రాణ స్నేహితులుగా మారారు. కొంత కాలం క్రితం ఇద్దరూ అనారోగ్యం బారిన పడ్డారు. వైద్య పరీక్షల అనంతరం గుండె సంబంధిత వ్యాధితో వీరన్న, షుగర్, బీపీతో రవీంద్ర బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ క్రమంలో ఇద్దరూ మద్యానికి బానిసయ్యారు. దీంతో వారి ఆరోగ్యం మరింత క్షీణించింది. పది రోజుల క్రితం ఆయాసం ఎక్కువ కావడంతో వీరన్నను కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో కుటుంబసభ్యులు చేర్పించారు. రవీంద్ర ఆరోగ్య పరిస్థితి కూడా క్షీణించడంతో కుటుంబసభ్యులు వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కర్నూలులోని ఆస్పత్రిలో చేర్పించారు. ఇద్దరి ఆరోగ్య పరిస్థితి పూర్తిగా విషమించడంతో మంగళవారం తెల్లవారుజాము 5 గంటలకు రవీంద్ర, 5.30 గంటలకు వీరన్న మృతిచెందారు. పోస్టుమార్టం అనంతరం మధ్యాహ్నం ఇద్దరి మృతదేహాలను కుటుంబసభ్యులు గ్రామానికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు.

మట్కా బీటర్ల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగయ్య (చిత్రంలో) సీఐ ఆనందరావు, ఎస్ఐ ధరణీబాబు, సిబ్బంది

తాడిపత్రి: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి 17 మంది మట్కా బీటర్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.10.02 లక్షల నగదు, మట్కా పట్టీలు, బాల్ పెన్నులు స్వాధీనం చేసుకున్నారు. తాడిపత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ గంగయ్య వెల్లడించారు. పట్టణ సీఐ ఆనందరావు, ఎస్ఐ ధరణీబాబు నేతృత్వంలో ఏఎస్సైలు రాజశేఖర్, రామ్మోహన్‌రెడ్డి, సిబ్బంది మూడు బృందాలుగా విడిపోయి మంగళవారం ఉదయం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మట్కా రాస్తూ చేనేత కాలనీకి చెందిన షేక్ అన్వర్‌బాషా, పాత కోటకు చెందిన గన్నె కృష్ణ, పోరాట కాలనీకి చెందిన తుంగా రామాంజులరెడ్డి, ఆంజనేయ మాన్యం ప్రాంత నివాసి చుక్కలూరు చాంద్ బాషా అలియాస్ చాంద్, రేగి చెట్టు నూర్ బాషా, శ్రీనివాసపురానికి చెందిన దూదేకుల కుళ్లాయప్ప, జవాజీ జగదీష్, నందలపాడు నివాసి మిద్దె ఓబయ్య, చింతలప్ప వీధికి చెందిన ఉదయగిరి మాబున్నీ, ఇందిరా నగర్ బాషుమున్నీ, అంబేడ్కర్ నగర్ నివాసి సంజామల వన్నూర్‌బీతో పాటు మండలంలోని అక్కన్నపల్లి గ్రామానికి చెందిన చిన్నబాలయ్య, చంద్రశేఖర్, తలారి నాగరాజు, గన్నెవారిపల్లి కాలనీకి చెందిన తలారి బయన్న, బోడెద్దుల మాధవరెడ్డి పట్టుబడ్డారు. నిందితుల నుంచి రూ. 10,02,000 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. బీటర్ల అరెస్టులో చొరవ చూపిన సిబ్బందిని ఈ సందర్భంగా డీఎస్పీ అభినందించారు. తాడిపత్రి ప్రాంతంలో ఇకపై ఎవరైనా మట్కా నిర్వహిస్తే వారిపై సస్పెక్ట్ షీట్ తెరవడంతో పాటు పీడీ యాక్ట్ ప్రయోగించి జిల్లా బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు.

జిల్లాకు చేరిన పదో తరగతి ప్రశ్నపత్రాలు


స్ట్రాంగ్‌రూం సీలును పరిశీలిస్తున్న డీఈఓ సాయిరామ్

రాప్తాడురూరల్: పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు మంగళవారం సాయంత్రం జిల్లాకు చేరుకున్నాయి. అనంతపురంలోని కేఎస్ఆర్ బాలికల పాఠశాల స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. డీఈఓ సాయిరామ్, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ పరిశీలించిన తర్వాత స్ట్రాంగ్‌రూంకు సీలు వేశారు. బుధవారం ఉదయం ప్రశ్నపత్రాలతో పాటు ఓఎంఆర్ షీట్లు, ఆన్సర్ షీట్లు, సెంటర్ మెటీరియల్‌ను ఆయా కేంద్రాలకు తరలించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 49 కేంద్రాల్లో జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 14,465 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ఫోర్ వీలర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు

అనంతపురం: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అనంతపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల స్కిల్‌హబ్‌లో ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్, అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సును నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సి.జయచంద్రా రెడ్డి తెలిపారు. ఫోర్‌వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సుకు పదో తరగతి, ఐటీఐ, డిప్లొమో పూర్తి చేసిన వారు, అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు విద్యార్హతను బట్టి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 95818 53106లో సంప్రదించాలని కోరారు. కాగా, డిప్లొమో కోర్సుల్లో అడ్మిషన్లకు నిర్వహిస్తున్న ఏపీ పాలిసెట్- 2023 కౌన్సెలింగ్ రెండో రోజు కొనసాగింది. బుధవారం 27,001 నుంచి 43 వేల ర్యాంక్ వరకు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నారు.

కాలుష్య నియంత్రణపై పోటీలు

రాప్తాడు రూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని 6 నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు 'కాలుష్య నియంత్రణ', 'పర్యావరణ జీవనశైలి' అంశాలపై పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు డీఈఓ సాయిరామ్, కాలుష్య నియంత్రణ శాఖ పర్యావరణ ఇంజినీర్ శంకర్‌రావు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'పర్యావరణ హిత శైలి'పై విద్యార్థులను చైతన్య పరిచేలా జూన్ 3న జిల్లా సైన్స్ సెంటర్‌లో వక్తృత్వ, వ్యాసరచన, పోస్టర్ ప్రజెంటేషన్, సుడోకో, రూబిక్ క్యూబ్ పోటీలు ఉంటాయి. 6 నుంచి 8వ తరగతి విద్యార్థులను జూనియర్స్‌గా, 9, 10 తరగతుల విద్యార్థులను సీనియర్స్‌గా పరిగణిస్తారు. విజేతలకు జూన్ 5న అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నారు. పూర్తి సమాచారానికి 89859 34531, 86390 92816లో సంప్రదించవచ్చు.

క్లుప్తంగా

కార్తికేయుడికి అభిషేకాలు


స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

ఆత్మకూరు: పంపనూరు సర్వరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పోటెత్తారు. ప్రస్తుతం వేసవిసెలవులు కావడంతో ఆలయ దర్శనానికి పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. స్వామికి పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పూజలు, హోజరతులు అందించారు. అనంతరం ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీదేవికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. కుటుంబ సభ్యులతో కలసి విద్యార్థులు పంపనూరు సమీపంలోని సిటీ పార్కుకు వెళ్లి సరదాగా గడిపారు.

'చేనేతకు రక్షణ'పై నేడు సమాలోచన

అనంతపురం కల్చరల్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 5 గంటలకు 'చేనేతకు రక్షణ, కర్ణాటక ఎన్నికల్లో అక్కడి పౌరసమాజం నిర్వహించిన పాత్ర' అనే అంశాలపై సమాలోచన కార్యక్రమం జరగనుంది. స్థానిక జేవీవీ కార్యాలయంలో నిర్వహించనున్న కార్యక్రమానికి మేధావులు రావాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ దివాకర్‌రావు


నిరాహార దీక్ష చేస్తున్న జేఏసీ అమరావతి నాయకులు

అనంతపురం అర్బన్: ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా నాయకులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఒక్కరోజు నిరాహార దీక్ష చేశారు. సంఘం జిల్లా చైర్మన్ దివాకర్‌రావు మాట్లాడుతూ తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కారించాలనే డిమాండ్‌తో ఉద్యమిస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, అరియర్లు చెల్లించాలన్నారు. సీపీఎస్ రద్దు చేయాలన్నారు. తదితర డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పీఎస్ ఖాన్, నాయకులు ఖలందర్, రమేష్, సంతోష్‌గౌడ్, మహబూబ్‌బాషా, ప్రసాద్, శ్రీనివాసులు, రాజేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి


సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయ్‌ప్రసాద్

ఆత్మకూరు: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం తలుపూరు గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. గ్రామ వలంటీర్ల హాజరుశాతం పెంచాలని,విధులపై నిర్లక్ష్యం చేసే వలంటీర్ల వివరాలు తన దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సత్యబాబు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన ఆధ్యాత్మిక శిక్షణ


సర్టిఫికెట్లు అందుకుంటున్న చిన్నారులు

అనంతపురం కల్చరల్: స్థానిక హరిహర దేవాలయ ప్రాంగణంలో హరి: ఓం ఆధ్యాత్మిక వేదిక తరఫున నెలరోజులపాటు ఇచ్చిన వేసవి శిక్షణ మంగళవారం సాయంత్రం ముగిసింది. ఆత్మీయ అతిథులుగా హాజరైన ప్రధానోపాధ్యాయులు యజమాన్యం వేణుగోపాల శర్మ, సనాతన ధర్మవేదిక అధ్యక్షుడు రమణమూర్తి, వివిధ ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు, రవీంద్ర, చలపతిరెడ్డి, అమరావతి తదితరులు ప్రసంగించారు. చిన్నారులు గణపతిస్తోత్రం, నవగ్రహస్తోత్రం, లక్ష్మీ అష్టోత్తరం, ఆదిత్యహృదయం తదితర కఠిన శ్లోకాలను చెప్పి ఆహూతులను మంత్రముగ్ధులను చేశారు. శిబిరాన్ని నిర్వహించిన అనంత పద్మనాభయ్యను సన్మానించారు. అనంతరం చిన్నారులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందించారు.

చంద్రబాబువి స్వార్థ రాజకీయాలు

- నగరపాలక సంస్థ మేయర్ వసీం


విలేకరులతో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: మాజీ సీఎం చంద్రబాబువన్నీ స్వార్థ రాజకీయాలని మేయర్ వసీం అన్నారు. ప్రజలను మోసం చేసేందుకు మరోమారు మేనిఫెస్టోను విడుదల చేశారని ధ్వజమెత్తారు. సంక్షేమ పాలన సాగిస్తున్న జగన్ వెంటే ప్రజలు ఉన్నారని స్పష్టం చేశారు. మంగళవారం జగనన్న పాలన నాలుగేళ్లయిన సందర్భంగా, టీడీపీ మేనిఫెస్టోపై నగరపాలక సంస్థలో ఏర్పాటు చేసిన విలేకరులతో మేయర్ మాట్లాడారు. మహానాడు వేదికగా చంద్రబాబు నాయుడు కుట్ర రాజకీయాలకు తెరలేపారన్నారు. బాబు నోరు అబద్ధాల పుట్ట అని మండిపడ్డారు. 14 ఏళ్ల పాటు సీఎంగా చేశానని చెప్పుకునే ఆయన.. ప్రజలకేం మేలు చేశారో చెప్పాలన్నారు. 2014 ఎన్నికల ముందు ఇచ్చిన మేనిఫెస్టో హామీలను ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. 20 లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని తప్పుడు వాగ్దానాలు చేస్తున్నారన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి.. తాము అధికారంలోకొస్తే ప్రతి నెలా మూడు సిలిండర్ల గ్యాస్, బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని చెబుతున్నారని మేయర్ అన్నారు. అధికార దాహం కోసం హామీలను ఇస్తున్నారేగానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తరహాలో అభివృద్ధి చేస్తామని చెప్పలేకపోతున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షలాది మందికి ఉపాధి కల్పించడంతో వైద్య, పోలీసు శాఖల్లో వేల సంఖ్యలో పోస్టులు భర్తీ చేశారన్నారు. వివిధ సంస్కరణలతో అన్ని వర్గాలభ్యున్నతికి కృషి చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించారన్నారు. చిన్న వయసులోనే తనకు మేయర్‌గా అవకాశం కల్పించిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. టీడీపీ ఎన్ని కుట్రలు చేసినా రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు ఇస్సాక్, కమల్‌భూషణ్, అనిల్‌కుమార్ రెడ్డి, నాయకులు ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే జనరంజక పాలన

- డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి


మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి

అనంతపురం క్రైం: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాక్షస పాలన అందిస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగనన్న కాలనీల్లో 435 అడుగుల సామర్థ్యంతో ఇంటి స్థలం ప్రభుత్వం అందిస్తోందన్నారు. టీడీపీ ప్రభుత్వ ప్రభుత్వం 330 అడుగుల్లో టిడ్కో ఇళ్లను చేయించినట్లు గుర్తు చేశారు. ఇటీవల తమ ప్రభుత్వం ఇచ్చే స్థలం సమాధి కట్టుకోవడానికి పనికిరాదని చంద్రబాబు చౌకబారు వ్యాఖ్యలు చేశారని కోగటం విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 98 శాతం హామీలను నెరవేర్చిందన్నారు. తల్లి పొత్తి కడుపుల్లో ఉన్న బిడ్డ నుంచి పండు ముదుసలి వరకు వివిధ పథకాలతో ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా వేలాది జబ్బులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్లు అబూసలేహా, బాబాఫకృద్దీన్, నాయకులు దాదు, రవి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో కార్మిక వ్యతిరేక పాలన

- సీఐటీయూ ఆవిర్భావ సభలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

అనంతపురం అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు విమర్శించారు. మంగళవారం స్థానిక గణేనాయక్ భవన్ వద్ద సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఓబుళు ముఖ్యఅతిథిగా హాజరై సీఐటీయూ జెండాని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోదీ పాలనలో దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్నారన్నారు. నేషనల్ మానిటైజేషన్ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలు రోడ్లు, పోర్టులు, రైల్వే, విమానయానం, విశాఖ స్టీల్, తదితర వాటన్నింటినీ నగదీకరణ పేరుతో కారుచౌకగా కట్టబెడుతున్నారని విమర్శించారు. కార్మికులకు నష్టం కలిగేలా 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చారని అన్నారు. అన్ని రంగాల్లోని కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటనారాయణ, నాగభూషణం, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, లక్ష్మీనారాయన, లక్ష్మీనరసింహ, వరలక్ష్మి పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

ఆత్మకూరు: మండల కేంద్రంలో మంగళవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. సీపీఎం మండల కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ దేశంలో కార్మికుల సంక్షేమం, రక్షణ, హక్కుల కోసం 1970లో సీఐటీయూను ఏర్పాటు చేసి, 54 ఏళ్లు పూర్తయ్యిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జయమ్మ, మాంభావతి, సుబద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర


ఆత్మకూరులో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందించి, ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.అనంతరం కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఓబీ టైలర్ వెంకటేష్, శ్రీరామ్, మురళి, రాజశేఖర్, అనఅల్, ధనుంజయ, వెంకటేష్, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముదిగుబ్బ: క్రిష్టాపురం క్రాస్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు మహిళలకు తీవ్రగాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు అనంతపురం నగరానికి చెందిన అనితరాణి, నాగదేవి తమ సొంత పనులపై ముదిగుబ్బకు ద్విచక్రవాహనంలో వస్తున్నారు. ఎదురుగా వచ్చిన ట్రిప్పర్‌ను ఢీ కొనడంతో ఇరువురికి తీవ్రగాయాలు అయ్యాయి. అనితరాణికి కాలు విరగగా, నాగదేవికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 ద్వారా బత్తలపల్లి ఆర్‌డీటీ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

ప్రిన్సిపాల్ కారు డ్రైవర్ సస్పెన్షన్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని ప్రిన్సిపాల్ కారు డ్రైవర్ బాబును సస్పెండ్ చేశారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిర్దేశించిన డీజిల్ కంటే అధికంగా వినియోగించినట్లు రికార్డుల్లో స్పష్టమయ్యింది. ఏకంగా వైస్‌ఛాన్సలర్ కారు కంటే ఒక నెలలో రూ.6 వేలు అధికంగా డీజిల్ వినియోగించారు. దీంతో సస్పెండ్ చేశారు. శాశ్వత ఉద్యోగి అయి కూడా డీజిల్ దుర్వినియోగం చేశారని క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు.

ఆర్‌టీఐ చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలి


ఆర్‌టీఐ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సమాచార హక్కు పరిరక్షణ సంఘం ప్రతినిధులు

అనంతపురం అర్బన్: జిల్లాలో సమాచార హక్కు చట్టం సమర్థంగా అమలుకు చర్యలు తీసుకోవాలని ఆర్‌టీఐ కమిషనర్ యు.హరిప్రసాద్‌రెడ్డికి సమాచార హక్కు పరిక్షణ సంఘం ప్రతినిధులు విన్నవించారు. మంగళవారం కమిషనర్‌ను కలెక్టరేట్‌ని రెవెన్యూభవన్‌లో సంఘం అధ్యక్షుడు హొన్నూరప్ప, గౌరవాధ్యక్షుడు నబీరసూల్, కార్యనిర్వాహక అధ్యక్షుడు సౌకత్ ఆలీ, తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి కార్యాలయల్లో 4(1)(బీ) సమాచారాన్ని తెలుగులో తయారు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ఇలా మొత్తం 19 సూచనలు కమిషనర్ ముందు ఉంచారు. సంఘం నాయకులు ఖాసీం, మురళీధర్‌రావు, బాలన్న, హాజీ బషీర్ అహమ్మద్, అంకిరెడ్డి, తదితరులు తదితరులు పాల్గొన్నారు.

నీ సమస్యపై...కలెక్టర్‌తో మాట్లాడతా


దివ్యాంగుడు మద్దిలేటి సమస్య వింటున్న ఆర్‌టీఐ కమిషనర్ హరిప్రసాద్‌రెడ్డి

అనంతపురం అర్బన్: నీ సమస్యపై కలెక్టర్‌తో మాట్లాడతానని దివ్యాంగుడు మద్దిలేటికి సమాచార హక్కు చట్టం కమిషనర్ యు.హరిప్రసాద్‌రెడ్డి హామీ ఇచ్చారు. కమిషనర్‌ను మంగళవారం రెవెన్యూభవన్‌లో దివ్యాంగుడు మద్దిలేటి ఆర్‌టీఐ కమిషనర్‌ను కలసి వినతిపత్రం అందజేసి, సమస్య విన్నవించాడు. తనకు దివ్యాంగుల కోటా కింద కామధేను దుకాణ సముదాయంలో 3వ గదిని ఎస్సీ కార్పొరేషన్ ఇచ్చారన్నాడు. అయితే ఆ గదిలో ఇప్పటికే ఉన్న వారు ఖాళీ చేయడంలేదని, ఈ విషయంపై పలు మార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని చెప్పాడు. కమిషనర్ స్పందిస్తూ కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

డ్రిప్ పరికరాలతో అధిక పంటల దిగుబడి

- ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్ ఖాన్


ఆత్మకూరు వద్ద డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్

ఆత్మకూరు: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న డ్రిప్ పరికరాలు ఉపయోగించి అరకొర నీటివనరులతోనే అధిక పంటల దిగుబడి సాధించొచ్చని ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రం సమీపంలోని పంటపొలాలను ఆయన పరిశీలించారు. ఏపీఎంఐపీ పీడీ మాట్లాడుతూ ఈ ఏడాది 12 వేల హెక్టార్ల లక్ష్యం ఉందని, రైతులు డ్రిప్ పరికరాలకు సంబంధించి డీడీలు తీయొచ్చన్నారు. 28 కంపెనీల్లో ఏ కంపెనీకి డీడీలు తీసినా ఒకే ధర ఉంటుందన్నారు. వీటికి సంబంధించి రైతు భరోసా కేంద్రాల్లో రైతులు వేలిముద్రలు వేసి, నమోదు చేసుకోవాలన్నారు. గతేడాది రైతులకు ఇచ్చిన డ్రిప్ పరికరాలు నాణ్యతగా ఉన్నాయా? సక్రమంగా అందించారా? అని రైతులను అడిగి తెలుసుకున్నారు. పంటల సాగులో రైతులకు పలు సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో కెప్టెన్ కంపెనీ డీసీఓ ఆంజనేయులు, స్కిప్పర్ కంపెనీ డీసీఓ రాజకుళ్లాయప్ప, కెప్టెన్ కంపెనీ ఫీల్డ్ అధికారి పులుగూరు ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

జేఎన్‌టీయూఏ క్యాంపస్‌లోనూ సాఫ్ట్‌వేర్ కొలువులు


జేఎన్‌టీయూఏ డైరెక్టర్లకు వివరిస్తున్న కంపెనీ వైస్ ప్రెసిడెంట్ దామోదర్

అనంతపురం: ఎస్కేయూ క్యాంపస్‌లోని అటల్ ఇంక్యుబేషన్ కేంద్రంలో ఉన్న సాఫ్ట్‌వేర్ కంపెనీ అడ్వెంట్ గ్లోబల్ సొల్యూషన్స్ తన మరో బ్రాంచ్‌ను జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలో ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ దామోదర్.జే (డీజే) మంగళవారం తెలిపారు. ప్రపంచంలోని టాప్ -500 సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో చోటు దక్కించుకున్న అడ్వెంట్ గ్లోబల్ సంస్థ సీఈఓ రామ్ చప్పిడి అనంతపురానికి చెందిన వారన్నారు. జన్మభూమి రుణం తీర్చుకోవాలని ఎస్కేయూ, జేఎన్‌టీయూఏలో ఇంజినీరింగ్, ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులకు అదే క్యాంపస్‌ల్లోనే సాఫ్ట్‌వేర్ కొలువులు కల్పించాలనే ఉద్దేశంతో కృషి చేస్తున్నారన్నారు. ఇందుకు సంబంధించిన అంశాలను జేఎన్‌టీయూఏ వీసీ జింకా రంగజనార్దన, రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్‌తో మంగళవారం ఆయన సమావేశమై వివరించారు. వర్చువల్ విధానంలో అడ్వెంట్ గ్లోబల్ సొల్యూషన్ సీఈఓ రామ్ చప్పిడి మాట్లాడారు. జేఎన్‌టీయూఏ అకడమిక్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి. సుమలత, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సురేష్ బాబు, క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల కస్సు'బస్సు'

- బస్సు మొరాయించడంతో ఆందోళన
- డయల్ 100కు సమాచారం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ప్రయాణికులతో తిరుపతి వెళ్లాల్సిన ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అనంతపురంలో మొరాయించింది. దీంతో ప్రయాణికులు మరో సర్వీసు నడపాలని ట్రావెల్స్ యాజమాన్యాన్ని డిమాండ్ చేయగా, వారు పట్టించుకోకపోవడంతో వాగ్వాదానికి దిగారు. వివరాలు.. అనంతపురానికి చెందిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు (పీఎస్ఆర్) బళ్లారి నుంచి తిరుపతికి ప్రయాణికులతో సోమవారం బయల్దేరింది. తీరా ఉరవకొండకు వచ్చేసరికి బస్సులోని ఏసీ పనిచేయలేదు. కొద్దిసేపు బస్సు డ్రైవర్స్,కండక్టర్‌తో ప్రయాణికులు వాదించారు. అనంతపురం రాజురోడ్డుకు చేరుకోగానే బస్సు మొరాయించింది. శ్రీకంఠం సర్కిల్ వరకు వెళ్లి అక్కడ పూర్తిగా ఆగిపోయింది. రాత్రి సమయంలో మరో బస్సు సర్వీసు నడపాలని ప్రయాణికులంతా ట్రావెల్స్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. అయినా వారు పట్టించుకోలేదు. దిక్కుతోచని స్థితిలో ప్రయాణికులు డయల్ 100కు సమాచారం అందించారు. నగరంలోని ఒకటో పోలీస్ స్టేషన్ పోలీసులు ట్రావెల్స్ కార్యాలయం వద్దకు వెళ్లి యాజమాన్యంతో మాట్లాడారు. అప్పటికీ కూడా వారిలో చలనం లేకపోవడంతో కోపోద్రికులైన ప్రయాణికులు బస్సు రిపేరీ చేయిస్తారా? లేక మూకుమ్మడిగా దాడి చేయాలా? అని వాగ్వాదానికి దిగారు. ఇరువర్గాల వారిని శాంతింపజేసిన పోలీసులు.. మరో బస్సు ఏర్పాటు చేయాలని యాజమాన్యానికి సూచించారు. ప్రయాణికులతో గొడవకు దిగితే మీ వ్యాపారంపైనా ప్రభావం పడుతుందని పోలీసులు హెచ్చరించారు. అప్పటికే సమయం అర్ధరాత్రి 12.30 దాటిపోయింది. చిన్నపిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు బస్సు కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. పాస్‌పోర్టు స్లాట్ బుక్ చేసుకున్న మనోహరి అనే మహిళ బస్సు యజమాని నిర్లక్ష్యంపై వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేస్తానని ఆవేదన వ్యక్తం చేసింది. జిల్లా ఉన్నతాధికారులు కండీషన్ లేని ప్రైవేట్ వాహనాల యాజమానులపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరింది. ఎట్టకేలకు పోలీసులు ట్రావెల్స్ యాజమాన్యంతో సర్దిచెప్పి, మరో బస్సు సర్వీసును నడిపారు.

ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలపడాలి

- ముత్యాలమ్మ ఆలయంలో ఎమ్మెల్యే శంకరనారాయణ పూజలు

రామగిరి: ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలపడాలని శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ కోరుకున్నారు. మంగళవారం మండలంలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ మహానాడులో ఆపార్టీ నాయకులు జగన్ నామస్మరణ చేస్తున్నారని, అందులో ఎంతసేపు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించే చర్చ జరిగిందన్నారు. రాబోవు ఎన్నికల్లో బడుగుబలహీన వర్గాల పక్షపాతి అయిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపే ప్రజలు మొగ్గుచూపుతున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కురుబ ముత్యాలప్ప, నాయకులు పాల్గొన్నారు.

సైబర్ కవచ్ అవగాహన సదస్సుకు రండి

- ఎస్పీ కె.శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: సైబర్ కవచ్ అవగాహన సదస్సును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ కె. శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ వద్ద జూన్ 1న ఉదయం 10 గంటలకు సైబర్ కవచ్ అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు. ముఖ్య అతిథిగా అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్‌ఎన్ అమ్మిరెడ్డి హాజరవుతారన్నారు. సైబర్ కవచ్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు. ప్రజలు సైబర్ నేరస్తుల ఉచ్చులో పడకుండా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. వాట్సాప్‌ను హ్యాక్ చేశారని సందేహమున్నా , అదేవిధంగా మొబైళ్లలో వైరస్ చేరి ఉంటే ఎలా తొలగించుకోవాలో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం శివారులోని బళ్లారి రోడ్డు, కళ్యాణదుర్గం రోడ్డు పరిసర ప్రాంతాల్లో చైన్ స్నాచర్లు కొద్ది రోజులుగా హల్‌చల్ చేస్తున్నారు. మంగళవారం రాత్రి 8.30 అనంతపురం శివారుల్లోని బళ్లారి రోడ్డులో తిరుమల జనరల్ స్టోర్ నిర్వాహకురాలు జ్యోతి మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి లాక్కొని ఉడాయించాడు. కిరాణాషాపు వద్దకు వచ్చిన అగంతకుడు చిన్నారితో మాటలు కలిపి యజమాని జ్యోతి దృష్టి మరల్చాడు. అనంతరం ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కొని వెళ్లిపోయాడు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి


అర్బన్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ రమణారెడ్డి, ఉత్పత్తులపై ఆరా తీస్తున్న కమిషనర్

అనంతపురం క్రైం: ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలని కమిషనర్ రమణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం 50వ డివిజన్‌లోని 1,2 రోడ్ల వద్ద ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను కమిషనర్ ప్రారంభించారు. చేయూత ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళలకు ఏటా రూ.18.750 అందిస్తోందన్నారు. వీటితో పాటు రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు డ్వాక్రా రుణాలను అందించేలా చర్యలు తీసుకుందన్నారు. మహిళలు సొంతంగా వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. ఈ రోజూ మెప్మా అర్బన్ మార్కెట్‌లో 23 రకాల ఉత్పత్తులను విక్రయించడం ద్వారా రూ.81,500 వచ్చినట్లు మెప్మా అధికారులు తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, మెప్మా పీడీ హిసేన్, టీపీఓ విశ్వజ్యోతి, సిటిమిషన్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్ గురుశేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల పరిశీలన: నగరంలో జరుగుతున్న నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా శారద ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలని ఇంజినీర్లను ఆదేశించారు. రెండో రోడ్డు ఎక్స్‌టెన్షన్ ఇందిరానగర్‌లో గడప గడపకూ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు పరిశీలించారు.

గైనిక్ విభాగానికి అదనపు పడకలు

అనంతపురం క్రైం: అనంతపురం సర్వజనాస్పత్రిలోని గైనిక్ విభాగానికి అదనపు పడకలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఆస్పత్రి ఆవరణలోని ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఐడీ వార్డును గైనిక్ వార్డుగా మార్చారు. అందులో 40 పడకలను ఏర్పాటు చేశారు. మంగళవారం సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లతో సమావేశం నిర్వహించి, గైనిక్ హెచ్ఓడీ డాక్టర్ షంషాద్‌బేగంకు యూనిట్‌ను అప్పగించారు. బుధవారం నుంచి యూనిట్‌లోనూ గర్భిణులు, బాలింతలను చేర్చుకోనున్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ మాట్లాడుతూ గైనిక్ విభాగంలోని నాలుగు యూనిట్లకు సంబంధించి 120 పడకలు మాత్రమే మంజూరయ్యాయన్నారు. కానీ వివిధ యూనిట్లలో మొత్తం 160 పడకలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోజూ ఓపీ 250 నుంచి 270, ఐపీ 187, ప్రసవాలు 22 నుంచి 28 వరకు జరుగుతుంటాయని తెలిపారు.

2న వైఎస్సార్ యంత్రసేవా మెగా మేళా

కనగానపల్లి: శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో జూన్ 2న వైఎస్సార్ యంత్ర సేవా పథకం మెగా మేళా- 2 నిర్వహిస్తున్నట్లు ఏఓ కృష్ణకుమారి తెలిపారు. స్థానిక ఏఓ కార్యాలయంలో మంగళవారం ఆమె రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద ఆర్బీకేల ద్వారా క్లస్టర్ హైరింగ్ సెంటర్లలోని రైతులకు సబ్సిడీతో యంత్ర పరికరాలు అందిస్తోందన్నారు.